క్లుప్తంగా

ఇసుకతోటలో ఘనంగా బల్లల పండగ



బల్లల పండగలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో ఇసుకతోటలో రజక సేవా సమైఖ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్, తూర్పు నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావు హాజరయ్యారు. అనంతరం సంఘం సభ్యులకు ఆయన పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వేములవలస అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, సంఘం కార్యదర్శి మడక ఈశ్వరరావు, క్యాషియర్ వేములవలస శ్రీను, వైస్ ప్రెసిడెంట్ బవిరి అప్పలరాజు, జాయింట్ సెక్రటరీ వేములవలస అప్పలరాజు, సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పార్కులో నీరు వృథా



వృథాగా పోతున్న నీరు

ఏయూక్యాంపస్: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వుడాపార్క్‌లో నీరు వృథాగా పోతున్నా అడ్డకట్టవేసేవారు కనిపించలేదు. పార్క్ లోపల ఓపెన్ జిమ్‌ను ఆనుకుని ఉన్న కుళాయి నుంచి నీరు భారీగా ఎగజిమ్ముతోంది. కుళాయి కట్టడానికి అవకాశం లేకపోవడంతో వాకింగ్‌కి వచ్చిన వారు చూస్తూ ఉండిపోయారు. వందలాది లీటర్ల నీరు వృథాగా పోయింది. నీరు ఓపెన్ జిమ్ పరికరాల వద్దకు చేరింది. దీంతో వ్యాయామం చేయడానికి వచ్చిన వారు నిరాశగా వెళ్లిపోయారు.

రాష్ట్రబడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి



మంత్రి వనితకు వినతిపత్రం ఇస్తున్న లగుడు గోవింద రావు

ఏయూక్యాంపస్: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించే విధంగా కేటాయింపులు జరపాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవింద రావు అన్నారు. మంగళవారం అమరావతిలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.వనితను కలిసి బీసీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ నెల 28న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలని, బీసీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయింపు చేయాలని కోరారు. బీసీ కార్పొరేషన్లకు నిధులను కేటాయించాలని, జనాభాదామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, పారిశ్రామిక రంగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హోటల్‌లో ఆహార తనిఖీలు

బీచ్‌రోడ్డు: ఆహారప్రియులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టార్ అన్నపూర్ణ హోటల్‌లో తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నందు ఉన్న స్టార్ అన్నపూర్ణ హోటల్‌లో ఇడ్లీలో ఇసుక కలుస్తుందని పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. స్పందించిన నందాజీ.. తనిఖీ చేయాల్సిందిగా ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావును ఆదేశించారు. మంగళవారం హోటల్‌కు వెళ్లి ఇడ్లీ శ్యాంపిల్స్ సేకరించారు. శ్యాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం పంపిస్తామని నివేదిక వచ్చిన తరువాత లోపాలుంటే చర్యలు తీసుకుంటామని నందాజీ తెలిపారు.

పల్సస్ ఉద్యోగులకు తక్షణమే జీతాలివ్వాలి

డాబాగార్డెన్స్: రుషికొండ ఐటీ సెజ్‌లోని పల్సస్ హెల్త్ టెక్ సంస్థలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులకు బకాయి పడ్డ 4 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఎంతో నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులతో అతి తక్కువ జీతాలతో పని చేయించుకుంటూ, ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు.

ఓం నమో శివ రుద్రాయ



మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలకు ఆలయాలు సిద్ధమయ్యాయి. తూర్పు నియోజకవర్గంలోని పలు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చెంబుడు నీళ్లు పోస్తేనే కరుణించి వరాలిచ్చే పరమేశ్వరుడిని ఆరాధించడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. ప్రధాన ఆలయాలలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు జరపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. – ఏయూక్యాంపస్



లలిత పీఠంలో...

కిర్లంపూడి లే అవుట్‌లోని లలిత పీఠంలో ఉదయం 4 గంటలకు సామూహికంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటలుక శ్రీ లలితా సుందరేశ్వరుల దివ్య కళ్యాణం రాత్రి లింగోద్భవ సమయంలో ప్రత్యేక అభిషేకం జరుపుతామని ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి లక్ష్మణ స్వామి తెలిపారు. శివరాత్రి రోజున మహారుద్ర పాశుపత హోమం, లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుపుతారు.అదే విధంగా బుధవారం ఉదయం 10 గంటలకు మహాకుంభమేళ తీర్థ జలాలలో అభిషేక, అన్నాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు.



లలితా పీఠంలో సుందరేశ్వర స్వామి

- శివరాత్రి సర్వం సిద్ధం
- ఆలయాలు ముస్తాబు



బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయం

అసంగానంద ఆశ్రమంలో...

పెదవాల్తేరులోని అసంగానంద ఆశ్రమంలో మహాశివరాత్రి పర్వదినాన్ని శ్రీ విష్ణు సేవానంద గిరి స్వామి పర్యవేక్షణలో జరుపుతున్నారు. ఉదయం 4 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు గంగా, యమున, సరస్వతి, కృష్ణ, గోదావరి నదీ జలాలలో అభిషేకం, రాత్రి లింగోద్భవ కాలంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. సాయంత్రం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.



మృత్యుంజయేశ్వరుడు

ఆలయాలకు పండగ శోభ

ఆలయాలు పండగ శోభను సంతరించుకున్నాయి. ఆలయాలను పువ్వులు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. చినవాల్తేరులోని దుర్గామల్లికార్జున స్వామి, పాండు రంగ స్వామి ఆలయంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో..

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్ మందిరంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులచే సామూహిక వివిధ ఫలరసామృత అష్టోత్తర శత కలశ, ఏకాదశి రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



బీచ్‌రోడ్డులోకి కోటేశ్వర స్వామి

నిర్లక్ష్యం నీడలో మహిళా ప్రాంగణం

పట్టించుకోని ప్రభుత్వం



జిల్లా మహిళా ప్రాంగణం



మహిళా ప్రాంగణంలో ఖాళీ స్థలం



మహిళా ప్రాంగణంలో నిర్మించిన బీఆర్‌టీఎస్ రోడ్డు భాగం



ప్రాంగణంలో ఇటీవల జరిగిన టైలరింగ్ శిక్షణ



మహిళా ప్రాంగణంలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్ల నిర్మాణాలు



జీడీఏ శిక్షణ నర్సింగ్ విద్యార్థులు

ఆరిలోవ: జిల్లా మహిళా ప్రాంగణంలో పాలకుల నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోంది. మారుమూల ప్రాంతాలలో మహిళలకు సైతం చేతి వృత్తుల్లో శిక్షణ ఇచ్చే ఈ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ప్రతి ఏడాది వివిధ చేతివృత్తుల్లో ఉచితంగా శిక్షణ పొందిన వేలమంది మహిళలతో కళకళలాడే ఈ ప్రాంగణం ఇప్పుడు బోసిపోయింది. జీవీఎంసీ 13వ వార్డు పరిధి పైనాపిల్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా మహిళా ప్రాంగణం నిర్వహిస్తున్నారు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి జిల్లాలో మహిళా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లాకు పైనాపిల్‌కాలనీలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మహిళలకు వివిధ చేతి వృత్తులకు సంబంధించిన ఉచితంగా శిక్షణలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వేలమంది మహిళలకు ఇక్కడ శిక్షణ ఇచ్చారు. నిత్యం శిక్షణలు జరుగుతుండటంతో ఈ ప్రాంగణంలో మహిళలతో కళకళలాడేది. ఇప్పుడు ఈ ప్రాంగణంలో ఆ కళ కరువైంది. అరకొరగా జరుగుతున్న శిక్షణలతో ఈ ప్రాంగణం మహిళలు లేక బోసుపోతోంది. ఇక్కడ సుమారు ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో పాటు దీనికి కేటాయించిన స్థలం కూడా తగ్గిపోయింది.

అరకొర శిక్షణలు..

సుమారు ఎనిమిదేళ్లుగా ఈ ప్రాంగణంలో ఏడాదికి నాలుగైదు బ్యాచ్‌లకు మాత్రమే శిక్షణలు ఇస్తున్నారు. ఇక్కడ మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, నర్సింగ్, మగ్గం వర్క్, బేసింగ్ సూయింగ్ తదితర వాటిలో శిక్షణ ఇవ్వడంతో పాటు కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, ఆశా వర్కర్లకు మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించి ఓరియంటేషన్ తరగతులు నిర్వహించేవారు. గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి ఇంతవరకు సుమారు 50 వేలకు పైగా మహిళలు శిక్షణ పొందారు. వారికి నెల, మూడు నెలలు కోర్సులు బ్యాచ్‌లు వారిగా నిర్వహించేవారు. ఇక్కడ శిక్షణ పొందిన అనంతరం వారు స్వయం ఉపాధి సాధించడం, ఉద్యోగాలలో చేరేవారు. ప్రభుత్వం సంస్థలు, డీఆర్‌డీఏ తదితర సంస్థలు ఈ ప్రాంగణంలో శిక్షణలు నిర్వహించేవి. వారు బ్యాచ్ లు వారిగా ప్రాంగణానికి కొంత రుసుం చెల్లించేవారు. ఇప్పుడు ఆ శిక్షణలు ఇక్కడ తగ్గిపోయా యి. ప్రాంగణానికి ఆదాయం సమకూరడం లేదు.

మిగిలింది 6.7 ఎకరాలు..

ఈ ప్రాంగణానికి 1987లో రాష్ట్ర ప్రభుత్వం 11.6 ఎకరాలు స్థలం కేటాయించింది. దీనిలో బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో 2.8 ఎకరాలు పోయింది. మిగిలినదానిలో మరో 2.1 ఎకరాల స్థలంలో ఆరేళ్ల క్రితం హుద్‌హుద్ నివాసాలు నిర్మించారు. దీంతో ప్రస్తుతం 6.7 ఎకరాలు మత్రమే స్థలం మిగిలింది. గతంలో ఇక్కడ ఖాళీ స్థలంలో కూరగాయాలు పంటలతో పాటు వివిధ రకాల పూల మొక్కలతో పచ్చదనం ఉండేది. ఈ స్థలంలో నిర్మాణాలు జరగడంతో పచ్చదనానికి కూడా కరువైంది. ఇదంతా ఈ ప్రాంగణంపై అధికారుల చూపుతున్న నిర్లక్ష్యమే కారణమని స్థానికులు భావిస్తున్నారు.

బ్యాచ్‌లు తగ్గాయి



నగరంలో పలు ప్రైవేట్ శిక్షణ సంస్థలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ సంస్థలు కూడా ఆ ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్లవైపే మొగ్గుచూపుతున్నాయి. దీంతో ఈ ప్రాంగణంలో శిక్షణల బ్యాచ్‌లు కొన్నాళ్లుగా తగ్గిపోయాయి. నిత్యం ఇక్కడ మహిళలకు శిక్షణ కోసం డీఆర్‌డీఏ అధికారులతో సంప్రదిస్తున్నాం. ప్రస్తుతం 8 రోజుల కోర్సు కొనసాగుతోంది. ఇటీవల రెండు కోర్సులు ముగిశాయి. ఇక్కడ కోర్సులు నిర్వహణకు అన్నీ అనుకూలమైన వసతులు ఉన్నాయి.

– పి.విమల, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్

ఎగ్‌బడ్డారు..!



గుడ్లు, చికెన్ వంటకాలు పంపిణీ చేస్తున్న పౌల్ట్రీ వ్యాపారులు

ఆరిలోవ : బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చికెన్, గుడ్లు తినేందుకు జనం భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పౌల్ట్రీ వ్యాపారులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ఈనేపథ్యంలో చికెన్, గుడ్లు తినడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉచితంగా గుడ్లు, చికెన్ వంటకాలను పంపిణీ చేస్తున్నారు. షాపులకు వెళ్లి కొనుగోళ్లు చేసేందుకు భయపడుతున్న జనం..ఉచితంగా చికెన్, గుడ్లు పంపిణీ చేస్తుంటే మాత్రం ఎగబడుతున్నారు. మంగళవారం ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌లో జరిగిన వారపు సంతలో వెన్‌కోబ్ చికెన్ వ్యాపారులు వండిన చికెన్, ఉడకబెట్టిన గుడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. దీంతో సంతకు వెళ్లినవారు ఎక్కువమంది వాటి కోసం గుమిగూడారు. క్యాకట్టి చికెన్ ముక్కలు, గుడ్లు అందుకొని ఆహా ఏమి రుచి అంటూ ఆరగించారు. బర్డ్‌ఫ్లూ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని, చికెన్, గుడ్లు తినవచ్చంటూ వ్యాపారులు ప్రచారం చేశారు.

పార్కులో మొక్కలు నాటాలి



పార్క్‌లో ఎండిపోగా తొలగించిన చెట్లు



ఏయూక్యాంపస్: చెట్లు ఎండకు వాడిపోయాయి. ప్రమాదకరంగా ఉన్న వీటిని తొలగించారు. వీఎంఆర్‌డీఏ పార్క్‌లో పిల్లల ఆటలాడుకునే ప్రాంతంలో రెండు చెట్లు ఉండేవి. ఇటీవల కాలంలో ఇవి ఎండిపోవడంతో తొలగించారు. వీటి స్థానంలో కొత్త మొక్కలను నాటితే బాగుంటుందని నగరవాసులు అభిప్రాయ పడుతున్నారు.

ఆహార ప్రయోగశాల వినియోగంలోకి తేవాలి



మాట్లాడుతున్న మేడపాటి రవీంద్ర

ఎంవీపీకాలనీ: చినవాల్తేర్‌లోని ఈఎస్‌టీ ఆస్పత్రి సమీపంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన రాష్ట్ర ఆహార ప్రయోగశాల (ఎస్ఎస్ఎస్ఏఐ) వినియోగంలోకి రాకపోవడం దారుణమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆ ఆహారశాలను ప్రారంభించి ఏడాదవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మంగళవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ లేకపోవడంతో కేంద్రం దీన్ని మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే దీన్ని అందుబాటులోకి తేవడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నేటికి పరీక్షల కోసం వినియోగదారులు ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లాల్సివస్తోందన్నారు. ఇప్పటికైనా ఈ ఆహార ప్రయోగశాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన వనరులను సంరక్షించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న గెయిల్ అధికారులు, సిబ్బంది

ఏయూక్యాంపస్ : ఇంధన వనరులను సంరక్షించుకోవాలనే సందేశాన్ని చాటుతూ గెయిల్ అధికారులు సిబ్బంది మంగళవారం బీచ్‌రోడ్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా నిర్వహించిన కార్యక్రమంలో గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (ఓఅండ్ఎం) ఎల్.ఎస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఇంధన వనరుల పరిరక్షణ, సంరక్షణ దిశగా విస్తృత అవగాహన, చైతన్యం కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. విభిన్న ప్రాంతాలలో ఈ సాక్ష్యం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంలో బీచ్‌రోడ్డులో అవగాహన కల్పిస్తూ వాక్‌థాన్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జీఎం ఎంవీఎస్ మూర్తి, రామకృష్ణ, డీజీఎం స్టీఫెన్ పట్ట తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య బిర్లా గ్రూప్‌తో ఒప్పందం



ఒప్పంద పత్రం అందుకుంటున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ విద్య ,మానసిక ఆరోగ్యంపై దృఢమైన నిబద్ధతతో మార్గనిర్దేశం చేయడం, జీవితాంతం నేర్చుకోవడాన్ని పెంపొందించడం అందరికీ జీవన నాణ్యతను మెరుగుపరచడం కోసం వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నామని ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ , డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు తెలిపారు. ట్రస్ట్ ద్వారా కళాశాల విద్యార్థులకు విలువ ఆధారిత, నాయకత్వ లక్షణాలు కలిగే సమర్థ వ్యక్తులుగా మలచడంపై దృష్టి సారించామన్నారు. మానసిక ఆరోగ్యం , శ్రేయస్సును సమగ్రంగా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు డి.శ్రావణ్ కుమార్, కె .రవిబాబు, ఎం .రాజేశ్వరరావు, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, డాక్టర్ జి.రాజకుమార్, డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ ఎం. శ్రీనివాస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3.50 లక్షలు అందజేత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందేవరకు అవసరమైన సహాయం అందజేస్తామని నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సహాయ కేంద్రం ద్వారా తీసుకున్న చర్యల్లో భాగంగా ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో చనిపోయిన గొల్లవిల్లి అప్పారావుకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలపాలైన యస్.వీర్రాజు, సీహెచ్.కామేశ్వర్‌సాయి, నీలి రాజులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రూ.1.50 లక్షలు అందజేసి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని ఆయన తెలిపారు.

రామకృష్ణాపురంలో అగ్ని ప్రమాద కలకలం



రామకృష్ణాపురం గ్రామం వెనుక రేగిన మంటలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం కలకలం రేగింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో ఏం జరిగిందో తెలియక స్థానికులు ఆందోళన చెందారు. గ్రామం వెనుక గతంలో నిర్వహించిన ఇసుక యార్డులో కొన్నాళ్లగా కొందరు చెత్త పోగులు వేస్తున్నారు. విద్యుత్ విభాగం సిబ్బంది రోడ్ల పక్కన విద్యుత్ తీగలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి ఇక్కడే డంప్ చేస్తున్నారు. అవి బాగా ఎండిపోవడంతో ఎవరో ఆకతాయిలు వాటికి మంగళవారం నిప్పంచారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు రేగడంతో దట్టమైన పొగ వ్యాపించింది. ఆ పొగతో రామకృష్ణాపురంవాసులు ఆందోళనచెందారు. కళ్ల మంటలతో ఇబ్బంది పడ్డారు. స్థానికుల అగ్ని మాపక అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు అక్కడకు చేరుకొని మంటలు అదుపు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు.

తీరంలో గస్తీనౌక



సాగర తీరంలో గస్తీ నౌక దర్శనమిచ్చింది. కస్టమ్స్ విభాగానికి సంబంధించిన ఈ నౌక మంగళవారం మధ్యాహ్నం సాగరతీరంలో కనిపించింది. ఈ నౌకను నగరవాసులు, పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. విధి నిర్వహణలో భాగంగా కోస్ట్‌గార్డ్, కస్టమ్స్‌కి సంబంధించిన నౌకలు నిత్యం పహారా కాస్తుంటాయి.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం